

# పృథ్వి

భారత సరిహద్దు ప్రాంతం మరోసారి దిక్కులు పిక్కటిల్లేలా దద్దరిల్లుతోంది... రాకెట్ లాంచర్లు గగనతలాన్ని చీల్చుతున్నాయి... బంకర్ల నించి వడగళ్లవానలా కురుస్తున్న గుళ్లు... నిర్విరామంగా మూణ్ణెళ్లనించి సాగుతున్న యుద్ధం...

సైన్యం ఉక్కుపిడికిలి బిగించి పోరాడుతోంది... రవ్వంత విశ్రాంతి కూడా దొరకని పోరాటం అది... అప్పుడు... సాయంత్రం నాలుగున్నర గంటలు దాటుతోంది. విస్ఫోటనా శబ్దాల ప్రతిధ్వనులు శాంతికపోతపు గుండెకవాటాలై కొట్టుకుంటున్నాయి...

మేజర్ జనరల్ మనీందర్‌సింగ్ తొణకని ఆత్మవిశ్వాసంతో సైన్యాన్ని నడిపిస్తున్నాడు. ఊపిరి పీల్చుకోవడానికి కూడా వ్యవధిదొరకని ఆ సమరభూమిలో సైతం అతడికి ఓ టెలిగ్రాం చేరింది అనూహ్యంగా... అయినా తీసి చదివాడు.

"విక్రమ్ దేవ్‌కి... మీకు కొడుకు పుట్టాడు. ఒక్కసారి వచ్చి వెళ్లగలరు. ప్లీజ్... శృతి" ఇదీ ఆ టెలిగ్రాం సారాంశం !

కెప్టెన్ విక్రమ్‌దేవ్... గుర్తుకురాగానే మేజర్ మనీందర్‌సింగ్ ముఖంలోని యుద్ధ

గంభీరత విజయగర్వంగా మారింది.

శత్రుసైన్యాన్ని తన బెటాలియన్‌తో తరిమితరిమి కొడుతున్న వీరజవాన్! ఎనిమిది రోజుల కింద ఒక్క లైట్ మెషీన్‌గన్‌తో ముప్పయ్ మంది ముష్కరుల్ని మట్టికరిపించిన కెప్టెన్ విక్రమ్ నిజంగా భరతమాత నుదుటి సింధూరమే !

తనకి కొడుకుపుట్టాడని తెలిస్తే మరింత ఆనందంగా యుద్ధభూమిలో పేట్రేగి పోతాడు. అన్పించింది మేజర్ మనీందర్ సింగ్‌కి. నిజానికా సమయంలో ఉత్తరాలు, టెలిగ్రామ్‌లు నిషేధమే. కాని షిఫ్టు సిస్టం కింద రెస్ట్‌లో వున్న విక్రమ్‌కి కబురుపెట్టాడు.

క్షణాల్లో వచ్చి సెల్యూట్ చేసి నిలబడ్డాడు కెప్టెన్ విక్రమ్‌దేవ్.

"విష్‌యూ ఆల్‌దిబెస్ట్ మై బోయ్... నీకు కొడుకు పుట్టాడు. ఇదిగో టెలిగ్రాం" అంటూ ఇచ్చాడు. విక్రమ్ కళ్లల్లో వేయి విస్ఫోటనాల వెలుగులు విరజిమ్మాయి. టెలిగ్రాం చదివి ఉబ్బితబ్బిబ్బయ్యాడు.

ఎక్కడో కనుకొనల్లో క్షణంపాటు మెరుపులా పాకిపోయిన నిరుత్సాహం...

అది పసిగట్టాడు మేజర్ మనీందర్.

విక్రమ్ భుజాన్ని ఓ చేత్తో తట్టి... మరో చేత్తో తన తెల్ల మీసాల్ని, గెడ్డాన్ని నిమురుకొని

"మిస్టర్ విక్రమ్... నైన్‌టీన్ సిక్స్‌టీఫైవ్‌లో ఇండోపాక్ యుద్ధంలో అగర్తాలాలో ఉన్నప్పుడు నాకూ కూతురు పుట్టిందని టెలిగ్రాం వస్తే సంతోషించాను. కాని యుద్ధంలో కాన్‌సన్‌ట్రేట్ తప్పేది. సడెన్‌గా బోసినవ్వులు గుర్తొచ్చేవి... మా మిసెస్ గుర్తొచ్చేది... బట్ చాలా కంట్రోల్ చేసుకున్నాను. కనీసం రిప్లయ్ లెటర్ రాయాలన్నా అవకాశం దొరక్కపోయేది. యుద్ధభూమిలో వున్న సైనికుడికే తప్ప ఆ బాధ మరొకడికి అర్థంకాదు. చివరికి నా కూతుర్ని మూడు నెలల తర్వాత చూసుకున్నాను. మృత్యువుతో పోరాడి..." అని విక్రమ్‌దేవ్‌వైపు చూసాడు.

విక్రమ్‌కి చప్పున తన భార్య శృతి గుర్తొచ్చింది... ఆ అమాయకత్వం గుర్తొచ్చింది. గుండె గోడలు కూల్చి ఓ కన్నీటి కెరటం తన కళ్లని తడి చేయడానికి ప్రయత్నించి విఫలమైంది. కొద్ది దూరంలోనే నిర్విరామంగా మోగుతున్న మెషిన్‌గన్‌ల కాల్పులు...

"సర్..." అన్నాడు

"నీకింకా మూడ్రోజులు లీవ్ ఉందనుకుంటాను. ఐ సాంక్షన్డ్ అనెదర్ త్రీలీవ్స్... నీ బిడ్డని చూసి రా..." గంభీరంగా చెప్పాడు మేజర్.

ఆ మాటని విస్మయంగా, నమ్మలేనట్టుగా చూసాడు విక్రమ్.

"సర్...మీరంటున్నది..." ఎక్కడో శతఘ్ని పేలిన చప్పుడు...

కథా నిలయం
1029
శ్రీకాకుళం



"ఎస్ విక్రమ్... నీకిచ్చిన సెలవు రోజుల్లోనే నీ బిడ్డని చూసి తిరిగివస్తావన్న నమ్మకం నాకుంది. ఆ నమ్మకంతోనే నువ్వు అడక్కముందే లీవ్ గ్రాంట్ చేస్తున్నాను..."

"సర్.. మీ అభిమానానికి కృతజ్ఞతలు... కాని ఈ పరిస్థితుల్లో నేను వెళ్లడమంటే... విక్రమ్ మనసు ఊగిసలాడతోంది.

"యుద్ధభూమిలో కలలకు, ఊహలకు తావుండకూడదు. వేలు ట్రిగ్గర్ మీద వుండాలి. మనసు శత్రువు మీదుండాలి. మనలాంటి సైనికులు ఏ కొంచెం సెంటిమెంటల్‌గా ఫీలయినా మనం యుద్ధం చేయలేం. ఈ స్థితిలో నీకు టెలిగ్రాం చూపించే వాణ్ణేకాదు. బాగా ఆలోచించి... నీ కింకా మూడ్రోజులు లీవ్ ఉంది కాబట్టి..."

"సర్... మీరేమంటున్నారో..." మేజర్‌తో వాదించే ధైర్యం లేకపోయినా ఉద్వేగంతో ఏదో చెప్పబోయాడు కెప్టెన్ విక్రమ్‌దేవ్.

"స్టాప్‌దట్ మిస్టర్ విక్రమ్... మనకు దేశరక్షణే ముఖ్యం కాదనను... కాని మరోసారి ఆ టెలిగ్రాం చదువ్... రెండు ప్రాణులు నీ కోసం ఎదిరిచూస్తున్నాయి. రేపేమైనా అయితే భరతమాత దుఃఖం మనకు కన్పించకపోయినా భార్య కన్నీళ్లను ఏ అవార్డులూ, రివార్డులూ ఆపలేవురా... వీరజవాన్ జస్పాల్‌రాణా భార్య శోకం నన్ను అప్పుడప్పుడూ వెంటాడి మౌనముద్రలోకి తీసికెళ్తుంది. వీరమరణం పొందిన గురుదేవ్‌సింగ్ భార్య 'పరమవీరచక్ర' అవార్డ్ అందుకుంటూనే వేదిక మీదే కుప్పకూలిపోయింది. నా సర్వీస్‌లో ఎన్నో చూసాను. నీకు అవకాశం వుండబట్టే వెళ్లమంటున్నాను. అఫ్‌కోర్స్... నీ కొడుకుని కూడా నీలాగే దేశరక్షణ కోసం అంకితం చేస్తానంటేనే నిన్ను పంపించేది..." నవ్వుతూ అన్నాడు మేజర్ జనరల్ మనీందర్ సింగ్.

ఆ మాటతో విక్రమ్ ఛాతి పొంగింది...

ధృడ సంకల్పంతో కుడికాలు నేలకి కొట్టి శాల్యూట్ చేసి చెప్పాడు.

"వాడు నా రక్తం పంచుకుపుట్టిన వాడు సార్. వాడీ దేశం కోసమే పుట్టాడు. బైదిబై వాడిపేరు కూడా నిర్ణయిస్తున్నాను.... పృధ్వి" అన్నాడు విజయహాసంతో.

"పృధ్వీ ఈజిట్ ...? దగ్రేట్ పృధ్వీ ?" ఆశ్చర్యంగా అడిగాడు మేజర్.

"ఎస్సార్...పృధ్వీ" అన్నాడు.

భారత్ - బంగ్లాదేశ్ యుద్ధంలో ఏకకాలంలో ఎనిమిది వందల మంది శత్రువుల్ని ఒక్కపెట్టున నేలకూల్చిన శతఘ్ని పేరది !

"ఒకే... రేపు మార్నింగ్ ఫ్లయిట్‌కి నువ్వెళ్తున్నావ్.. ఈ సాయంత్రం నువ్వో పనిచేసి వెళ్లు. జీవన్ హెలికాప్టర్‌లో జమ్మూకెళ్లి ప్యాకేజి ఫుడ్ పట్టుకురావాలి. రెండు గంటల్లో

తిరిగిరావాలి. నువ్వయితేనే తిరిగి రాగలవు. యుకెన్ గో...."

"ఎస్ సర్..." కెప్టెన్ మరోసారి శాల్యూట్ చేసి వెనుదిరిగాడు.

రెండడుగులు వేసాడో లేదో... శృతి జ్ఞాపకాలు గుప్పుమన్నాయి. పది నిమిషాల వరకూ తేరుకోలేకపోయాడు.

అతడు కృతజ్ఞతగా వెనుదిరిగి చూసాడు... సెవెంత్ బెటాలియన్ వైపు వెళ్తున్న మేజర్ సింగ్ వైపు ! అప్పుడు సమయం అయిదుంపావు.

సరిహద్దులో మరో శతఘ్ని ప్రేలిన చప్పుడు...

★ ★ ★ ★

గగన తలాన్ని గాలితోనే చీల్చుకుంటూ వేగంగా వస్తోంది జీవన్ హెలికాప్టర్. కెప్టెన్ విక్రమ్‌దేవ్ తన సైనికుల కోసం ఆహారపొట్లాలు తీసికొస్తున్న హెలికాప్టరది.

హెలికాప్టర్ నడపటంలో ప్రత్యేక శిక్షణ పొందిన కెప్టెన్ విక్రమ్ ఎంత వేగంగా వస్తున్నా... భార్య శృతి గురించిన ఆలోచనలు అంతకంటె వేగంగా ముసురుకుంటూనే వున్నాయి.

ఆకాశంలో అప్పుడే పొడుస్తున్న నక్షత్రాలు మిణుకుమిణుకు మంటున్నాయి. సన్నటి వెన్నెల హెలికాప్టర్ క్యాప్‌గ్లాస్ లోంచి తొంగిచూస్తోంది.

లాంచర్ల మెరుపులకి...

ఫిరంగుల విస్ఫోటనా శబ్దాలకి...

శతృవుల హృదయ విదారక కేకలకి... అలవాటు పడ్డ ప్రాణం... అంత వేగంలోనూ ఆ నిశ్శబ్ద గగనాన వెన్నెలను చీల్చుకుంటూ వెళ్తున్న ఒంటరి మనసుకి గత జ్ఞాపకాలతో తీపి వూహల్ని జోడించి 'శృతి' చేసిన వీణయిపోయాడు. తుపాకుల్నీ తూటాల్నీ మర్చిపోయి...

హెలికాప్టర్ వేగం మాత్రం తగ్గలేదు...

పెళ్లి కాగానే... పదిహేను రోజులుండి తిరిగి వెళ్లిపోతానని బంధువులకి చెప్పిన విక్రమ్‌కి... పెళ్లయిన మర్నాటి రాత్రే అమ్మమ్మ చెప్పిన విషయం విని... గతుక్కుమన్నాడు.

శోభనం వాయిదా పడిందట ...

ఎంతో ఆతృతగా ఏవేవో ఊహల్తో క్షణమొక శకంలో ఎదిరిచూస్తున్న విక్రమ్‌కి ఎంతకూ అర్థం కాలేదు. 'ఎందుకు వాయిదా వేసారే' అని నోరు విడిచి అడిగినా ముసల్ది బోసినోటితో నవ్వింది తప్ప విషయం చెప్పకనే వెళ్లిపోయింది.

ఆదుర్దాగా పెళ్లి జరిపించి.. ఆరాత్రే శోభనం వాయిదా పడిందని చెప్పటం... ఒక్క సారి ఈ పెద్దలందర్నీ యుద్ధభూమికి తీసికెళ్లి మరఫిరంగులకి కట్టేసి కాల్చేయాలన్పించింది.

'పోనీ ... శృతి కన్పించదేం ?' విక్రమ్ ఆరాత్రి సరిగా నిద్రపోలేదు. అసలే పెళ్లి అలసట... తెల్లారేసరికి ఒళ్లు బంకర్ అంత బరువైపోయింది.

ఒక్కసారి శృతి కన్పిస్తే బావుండు...

ఆ అమాయకమైన కళ్లు... నవ్వగానే సొట్టలుపడే బుగ్గలు... పసిడి బొమ్మలాంటి శృతి రూపం గుర్తొచ్చి విక్రమ్ నరాలు జివ్వుమన్నాయి.

నోట్లో బ్రష్ వేసుకొని అంతమందిలో కళ్లతో ఎంత గాలించినా కన్పించని శృతి కోసం. అతడి మనసు ఆరాటపడుతోంది. ఓ కుర్రాడ్ని పిలిచి వాడి చేతిలో పది రూపాయలు పెట్టి 'శృతిని పిల్చుకురమ్మని' చెప్పాడు. వాడాపనికి ఇరవై రూపాయలవుతాయ్ అని చెప్పగానే 'హమ్మో...వీడు అంతర్గత శత్రువవుతాడనుకొని ఇరవై చేతిలో పెట్టగానే పెరట్లో గడ్డివాము ప్రక్కనే జడవిప్పుకుంటున్న శృతిని చూపించి తుర్రుమన్నాడు వాడు. విక్రమ్‌కి నవ్వొచ్చింది.

శృతి ఒక్కర్తె వుందక్కడ...

గడ్డివాము వెనకనించి నిశ్శబ్దంగా వెళ్లి... వెనకవైపునించి గట్టిగా వాటేసుకున్నాడు. ఉలిక్కిపడి కేకవేయబోయిన శృతి తనని పట్టుకున్న పారాణి చేతుల్ని చూసి 'విడువ్ బావా' అంది గోముగా...

శృతిని మెల్లిగా తనవైపు త్రిప్పుకొని "శోభనం ఎందుకు వాయిదా వేసారో చెప్పు ముందుగా..." అన్నాడు.

ఆ మాటతో శృతి త్రుళ్లిపడి తర్వాత నవ్వింది.

"విడిస్తే... చెప్తాను"

"నిజంగా... ?"

"ప్రామిస్"

విక్రమ్ శృతిని విడవగానే కళ్లల్లో కళ్లు పెట్టి గుసగుసగా...'పుటుక్కు జరజర డుబుక్కుమే...' అని కిల కిలా నవ్వి పారిపోయింది.

విక్రమ్‌కేమీ అర్థం కాలేదు. అటుగా వచ్చిన అమ్మమ్మని అడిగాడు.

"బామ్మా...పుటుక్కు జరజర డుబుక్కుమే అంటే ఏమిటే ?" అని అంతే !

బామ్మ నులకమంచమేసి కూచోబెట్టి అరగంటసేపు హరికథ చెప్పింది. పందిరి మీది గుమ్మడి కాయను ఎలుక 'పుటుక్కు'మని కొరకడం... అది 'జరజర'మని జారుతూ

'డుబుక్కు'మని పందిరికింది మేకమీద పడితే అది 'మే' అని అరవటం మొదలుకొని ఇంకొన్ని తెనాలి రామలింగడి పద్య పురాణాల్లోని చమత్కారాల వరకూ...

విక్రమ్ విసుగ్గా లేచి వెళ్లాడు.

ఎవర్ని అడగాలన్నా సిగ్గూ...భయం. శృతి కన్పించినప్పుడల్లా ఎవరూ చూడకుండా తనని 'వ్వెవ్వెవ్వె' అని వెక్కిరించడం... నాలుగు రోజులు భరించరాని టెన్షన్‌తో వేగలేక చివరికి "అమ్మా... నాకు లీవ్ దగ్గర పడింది. వెళ్లాలి" అంటే

"అదేంట్రా... ఈ రోజు రాత్రే శోభనం. ఓ నెలరోజుల వరకైనా లీవ్ పొడగించుకో" అని చెప్పగానే చప్పున చల్లారిన కోపం...

ఆ రోజు రాత్రి శోభనం గదిలో... శృతి చేసిన అల్లరి... మనసుని గిలిగింతలు పెట్టేది. సిగ్గుపడ్తూ అప్పుడు చెప్పింది. ఆడాళ్ళ మూడు రోజుల ఇబ్బంది గురించి... అందుకే శోభనం వాయిదా పడిందనీ...

నెల రోజులు తరిగిపోని అనుబంధపు శిఖరాల్ని అధిరోహించి తను తిరిగివచ్చిన వారం రోజులకే లెటర్ రాసింది.

"దేవా... ఈ నెలలో పుటుక్కు జరజర డుబుక్కు మే... లేదు. మరో తొమ్మిది నెలల దాకా వుండదు. ఆ తర్వాతే నీ ప్రతిరూపం... డుబుక్కు జరజర పుట్టుక్కు వ్వే..." అని శృతి అల్లరి గుర్తొచ్చి తనలో తానే నవ్వుకునేవాడు.

వెళ్లాలి... తను వెళ్లగానే శృతిని ఎత్తుకొని గాల్లో తిప్పాలి. పృథ్వికి చాలాచాలా బొమ్మలు తీసికెళ్లాలి... ఇద్దర్నీ ముద్దుల్తో ముంచెత్తాలి...

ఈ ఆలోచనల్లోనే అతడి కళ్లు చమక్‌మని మెరిసాయి.

ఆ వెంటనే అతడి ఆలోచనలు కుప్పకూలాయి.

కళ్లు మెరియలేదు... ఒక మెరుపుని కళ్లు గమనించాయి అన్న వూహ క్షణంలో తట్టగానే... హెలీకాప్టర్ వేగాన్ని కంట్రోల్ చేస్తూ... శత్రువుని పసిగడుతున్న డేగలా కళ్లు చిట్లించి చూసాడు...

గగన తలాన పుడమి తల్లిని ఢీకొట్టబోతున్న ఒక ఉల్కలాంటి మెరుపుని...కొన్ని వందల కిలోమీటర్ల దూరంలోంచి ఎదురుగా మెరుపువేగంగా వస్తోన్న ఒక చుక్క లాంటి మెరుపుని ఈసారి స్పష్టంగా గమనించాడు.

అతడి మనసెందుకో కీడు శంకించింది...

హెలికాప్టర్ వేగాన్ని కొంత తగ్గించి... పరీక్షగా చూసాడు. ఆ చుక్క పెద్దదవుతూ

చాలా వేగంగా తన హెలికాప్టర్ దిశగా రావటం స్పష్టంగా గమనించాడు.

అయితే అదేంటి... ??

అతడి ఆలోచన్లు క్షతగాత్రమైన యుద్ధ రంగమే అయ్యాయి. నిమిషం తర్వాత అతడు నిర్ధారించుకున్నాడు...

అది ఖచ్చితంగా శత్రువిమానమే...

గుండెపొరల్లో క్షణంపాటు మందుపాతర్లు ప్రేలినట్లు విభ్రమంగా అయిపోయాడు. ఆ వెంటనే తేరుకొని... అతడి ఆలోచనలు మిస్సాయిల్‌లా దూసుకెళ్లాయి. శత్రు విమానంగా నిర్ధారణకి రావడానికి రెండు కారణాలు. ఒకటి దాని కాంతి... రెండు వేగం...

యుద్ధరంగంలో ఆరితేరిన అతడి విజ్ఞానం క్షణాల్లోనే అది శత్రువిమానమనే కాదు కాంతిని, వేగాన్ని బట్టి శత్రుదేశం అమెరికా నించి దిగుమతి చేసుకున్న మిగ్-13 అని...

అందులో ఎనభై మంది సుశిక్షితులైన సైనికులు, అధునాతనమైన ఆయుధాలు వుంటాయని... క్షణాల్లో ఒక మహా నగరాన్ని స్మశానంగా మార్చేసే ఆ మృత్యుశకటం... పదునైన వేగంతో అది భారత సరిహద్దు దళాల కన్నుగప్పి భూభాగంలో ప్రవేశించిందని...

ఈ ఆలోచన రాగానే అతడికి క్షణంపాటు ఏంచేయాలో అర్థంకాలేదు. ఆహార పొట్లాలు తప్ప ఏ ఆయుధమూ లేదు తన దగ్గర. అయినా వెంటనే వాకీటాకీ ద్వారా కంట్రోల్ రూంకి తెలియజేసాడు రెండే ముక్కల్లో... ఇంత తొందర్లో వాళ్లేమీ చేయలేరని తెలుసు...

వాళ్లు అప్రమత్తం అయ్యేసరికి ఏదో ఒక మహానగరం స్మశానం అవుతుందనీ తెలుసు...

ఏం చేసినా తనే చెయ్యాలి...

కాని... ఏం చెయ్యాలి... ???

అది యుద్ధరంగంలో సైన్యం వాడే హెలీకాప్టర్ కూడా కాదు. కేవలం ఆహార పొట్లాల కోసం వాడే సాదాసీదా హెలీకాప్టర్...

దూసుకొస్తున్న కాంతి పుంజంలా మిగ్ - 13 మరింత దగ్గరవుతోంది.

మిస్సైల్‌లా మెదడు పొరల్ని చీల్చుకొని వచ్చిందో ఆలోచన... ఆ వెంటనే కళ్లల్లో నీళ్లు చిప్పిల్లాయి శృతి, బాబు గుర్తొచ్చి... బాధనీ, ఆవేశాన్నీ మునిపంట నొక్కిపట్టాడు.

అంత బాధలోనూ కన్నీళ్లతోపాటు అతడికి మేజర్ భుపీందర్‌సింగ్ గుర్తొచ్చాడు.

1965లో భారతపాక్ యుద్ధానంతరం లుథియానా ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడుతున్న మేజర్ భుపీందర్‌సింగ్‌ని అప్పటి ప్రధాని లాల్ బహదూర్‌శాస్త్రి పరామర్శించ

డానికి వస్తే... మేజర్ భుపీందర్ బావురుమని ఏడ్చాడు.

'వీర జవాన్‌లు ధైర్యానికి మారు పేరయితే... నీవేంటి ఇలా ఏడుస్తున్నావ్' అని ప్రధాని అడిగితే 'నేను చనిపోబోతున్నానని ఏడవటం లేద్సార్... నా గురించి తెల్సుకో వచ్చిన దేశప్రధానికి లేచి నిలబడి శాల్యూట్ చేయలేకపోతున్నానని ఏడుస్తున్నాను"

కెప్టెన్ విక్రమ్ కనుకొనల్లో చిక్కిన నీటిబొట్టుని సుతారంగా తొలగించి గుండె చుట్టూ ఆత్మస్థయిర్యాన్ని పొదువుకొని... ఒక్కసారిగా నింగిని తాకేలా హెలికాప్టర్‌ని మరింత పైకి...పై పైకి... ఎంతో ఎత్తుకు తీసుకెళ్లాడు.

అతడు మిగ్-13 వేగాన్ని అంచనా వేస్తూ హెలీకాప్టర్‌ని మరింత పైపైకి తీసికెళ్లాడు. వస్తున్న విమానం కంటె ఎత్తుగా తీసికెళ్లాడు.

అగ్నిగోళమై దూసుకువస్తున్న శత్రువిమానాన్ని ఈసారి మరింత దగ్గరగా... స్పష్టంగా చూసాడు.

అతడి గుండె చంద్ర నిప్పులై రేగింది...

కళ్లల్లో ఎరుపుజీరలు ఫెళఫెళమని ప్రాకాయి...

భార్యా, బిడ్డ ఎవరూ గుర్తు రాలేదు...

విమాన వేగాన్ని అంచనా వేస్తూ.... ఒక్కసారిగా హెలికాప్టర్ ఫ్లయింగ్ సిస్టం మొత్తాన్ని ఆఫ్ చేసాడు.

గాల్లోనే ఆగిపోయిన హెలీకాప్టర్ ఒక్కసారిగా కుప్పకూలుతూ సరిగ్గా కింద దూసుకెళ్తున్న శత్రు విమానాన్ని బలంగా తాకింది...,,

అంతే !

క్షణంలో .... భూమ్యాకాశాలు దద్దరిల్లిన విస్ఫోటనం...

ఖండ ఖండాలై పోయిన ఇనుపముక్కలు...

దూది పింజాలై చిట్లిపోయిన శరీరాలు...

స్ప్రే చేసిన రక్తంతో ఎర్రబడ్డ వెన్నెల...

నిమిషం తర్వాత... ఆకాశం మూగవోయి నిశ్శబ్దమై పోయింది.

ఎందుకంటె... ఈ స్థితిలో భర్త రాడేమోనని తెలిసి... అక్కడ ఎవరు చెప్పినా వినకుండా బాబుతో సహా ఆమె రైలెక్కింది....

●